17 వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
గురువారం | 09 మే 2024 | పేజీలు 8

# జనసేన ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబుకు ఘనస్వాగతం



8 లో

# సైకిల్ పక్కన పెట్టి... ఫ్యాన్ కింద కూర్చున్న బీసీలు..!



- పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశంతోనే పయనం...
- పార్టీ కష్ట కాలంలో ఉన్న ప్రతిసారి అండగా నిలబడ్డ బీసీ సామాజికవర్గం...
- పార్టీలో బీసీలకు తగిన గౌరవం లేదనే పార్టీ కార్యక్రమాలకు దూరం...
- కురుగొండ్లకి సహకరించని బీసీలు... - ఫ్యాన్ కిందకు వెళుతున్న నేతలు
- డాక్టర్ మస్తాన్ యాదవ్ తో మొదలైన వైకాపాలోకి వలసలు...

**అమరావతి మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నిన్న మొన్నటి వరకు ఆ పార్టీని బిసి సామాజిక వర్గం అంటి పెట్టుకుని ఉన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న ప్రతిసారి అండగా నిలబడ్డారు. వెంకటగిరి నియోజకవర్గంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా బిసి సామాజికవర్గం తెలుగుదేశం పార్టీకి దూరంగా ఉన్నారు. ఇందుకు కారణం కురుగొండ్ల రామకృష్ణ అంటూ సైకిల్ దిగేసి ఫ్యాన్ కింద కూర్చుంటున్నారు. ఎన్నికల హడావుడి మొదలైన నాటి నుంచి పూర్తయ్యే వరకు అంతా మాదే అంటూ భుజాలపై వేసుకుని తిరిగే బిసి సామాజికవర్గం ప్రస్తు తం టిడిపి కార్యక్రమాల్లో ఎక్కడా పెద్దగా కనిపించట్లేదని పార్టీ వర్గాలలో గుసగుసలు వినిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీలో బిసి లంటే రోజు రోజుకి విలువలేకుండా పోతుందని ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. కురుగొండ్ల రామకృష్ణ తన వర్గానికి వెండి పళ్లంలో, బిసి లకు మాత్రం కంచు పళ్లెంలో మాదిరిగా తమను తక్కువగా చూడటం జీర్ణించుకోలేక పోయామని వాపోతున్నారు.

**ప్రధాన పార్టీల ప్రచార హోరు....**

**టిడిపి ప్రచారాల్లో కనిపించని బీసీలు**

రెండు మూడు రోజుల్లో ప్రధాన పార్టీ అభ్యర్థుల భవితవ్యం తేలిపోయే సమయం వచ్చేసింది. మరోపక్క వైసిపి లోకి బిసి సామాజికవర్గం నుంచి భారీగా వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. తెలుగుదేశం అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ మాత్రం బిసి వలసలని అడ్డుకోలేక పోతున్నాడు. వెంకటగిరి తెలుగుదేశం పార్టీ టికెట్ ఆశించి బంగపడ్డ ప్రముఖ నాచురోపతి వైద్యులు డాక్టర్ మస్తాన్ యాదవ్ ఆ పార్టీని వీడి వైకాపా లోకి వెళ్లిపోయారు. అక్కడి నుంచి మొదలైన బిసి సామాజిక వర్గ వలసలు నానాటికి పెరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి తాళ్లూరు వెంకటరత్నం టిడిపి ని వీడి వైసిపి తలుపులు

మిగతా 3లో

# తలకిందులయ్యేనా..? చంద్రబాబు ఛాలెంజ్!



- ముందు నొయ్యి వెనుక గొయ్యి అన్న చందాన తయారైన నెలవల విజయ శ్రీ రాజకీయ జీవితం...
- ఆమెకు ఓటమి తప్పదంటున్న నియోజకవర్గ ప్రజలు ఓటర్లు
- సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇంతవరకు మహిళ గెలిచిన దాఖలాలె లేవు
- ఆమెకు రాజకీయ చరిత్ర ఏమి లేదు... డాక్టర్ వృత్తి తప్ప
- తండ్రి రాజకీయ వారసత్వం ఆమెకు కలిసి రాదని నియోజకవర్గ ప్రజల ఓటర్ల నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్న ఆరోపణలు
- 2024 లో ఆమెకు రాజకీయం జీవితం కలిసి వస్తుందా లేకుంటే డాక్టర్ వృత్తికే పరిమితం అవుతారా...?

**అమరావతి మేజర్‌న్యూస్:** సాక్షాత్తు మాజీ సీఎం టిడిపి పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చాలెంజ్... సూళ్లూరుపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ తో తలకిందుల కానుందని ఆ నియోజకవర్గ ఓటర్లు ప్రజల నుంచి వినిపిస్తున్న విశ్వసనీయ సమాచారం. ఆమె రాజకీయ భవిష్యత్తు ఏమీ లేదు. ముందు చూస్తే నొయ్యి వెనకన చూస్తే గొయ్యి అన్న చందాన తయారయింది ఆమె రాజకీయ జీవితం. వాస్తవంగా ఆమెఓ డాక్టర్. డాక్టర్ వృత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తండ్రి రాజకీయ వారసత్వం తో ముందుకు వెళ్లాలని ఆమె కంకణం కట్టుకుంది. తన తండ్రికి రావాల్సిన సీటును ఆమె సాధించుకుంది. నాటికి నేటికి సూళ్లూరుపేట నియోజకవర్గం మహిళలకు కలిసి రాదని ఆ నియోజకవర్గ ప్రజల ఓటర్ల నుంచి వినిపిస్తున్న విమర్శలు. ఇంతవరకు ఆ నియోజకవర్గానికి ఒక మహిళ అభ్యర్థిని కూడా ఏ పార్టీ అభ్యర్థులు ఏ పార్టీ అధిష్టానం కూడా ఇంతవరకు కేటాయించలేదు. కేటాయించిన పార్టీల అభ్యర్థులు కూడా గెలవలేదు.అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఛాలెంజ్‌గా తీసుకొని నెలవల సుబ్రహ్మణ్యంను కాదని ఆయన కుమార్తె నెలవల విజయ శ్రీకి సీటు ఇచ్చాడు. కానీ ఇంతవరకు ఆ నియోజకవర్గంలో మహిళలు ఎమ్మెల్యేలుగా గెలిచిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ హయాంలో సరస్వతి అనే మహిళకు సీటు ఇచ్చారు. ఆమె కూడా గెలవలేదు. అలాగే ప్రజారాజ్యం పార్టీలో ఈశ్వరమ్మకు ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు ఇచ్చారు. ఆమె

మిగతా 2లో

## ఓటు హక్కును వినియోగించుకోనున్న

# 41,993 మంది కొత్త ఓటర్లు

- తిరుపతి జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఓటర్లు 18,12,980
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్



**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్ :** సార్వత్రిక 2024 ఎన్నికల నేపథ్యంలో తిరుపతి జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఏప్రిల్ 25 నాటికి 18,12,980 మంది ఓటర్లు ఉన్నారని, మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని, ఇందులో 41,993 మంది 18-19 సంవత్సరాలు కలిగిన యువ ఓటర్లు తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ బుధవారం పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలైన గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు పరిధిలో

మిగతా 2లో



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్ మోహన్, ఇతర టిడిపి నాయకులు

# ఓటమి భయంతోనే నిరాధారమైన ఆరోపణలు

- నాపై చేస్తున్న అసత్య ఆరోపణలకు ప్రమాణానికి సిద్ధమా
- వైసీపీ అభ్యర్థి ఎర్రచందనం స్మగ్లర్ అని జిల్లాకే తెలుసు
- ఎన్డీఏ కూటమి అభ్యర్థి గురజాల జగన్మోహన్

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** నాపై సోషల్ మీడియాలో చేసిన ట్రోలింగ్లకు నేను కాణిపాకంలో ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చిత్తూరు తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ తెలియజేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఖచ్చితంగా గెలుపొందు తుందని, ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక సోషల్ మీడియా

మిగతా 2లో

## ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** వెదురుకుప్పం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో చేర తలసుకున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే భైరవుడు బుధవారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను విద్యార్థులచే అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జూన్ 10 వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఆసక్తిగల విద్యార్థులు ఐటిఐ ఏపీ జీఓవి ఇన్ వెబ్సైట్ నందు అప్లై చేసుకోవాలన్నారు. పదవ తరగతి మార్కులు జాబితా, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకుని వస్తే ఐటిఐ నందు ఉచితంగా ఆన్లైన్లో దరఖాస్తు చేయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తు చేసిన విద్యార్థులు చివరి తేదీలోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటిఐ వెదురు కుప్పం నందు హాజరై సర్టిఫికెట్లు వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు తమ మెరిట్ ర్యాంక్ ఆధారంగా జూన్ 18వ తేదీ నుండి జూన్ 26వ తేదీ వరకు చిత్తూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఎవరికి కాల్ లెటర్లు పంపడం జరగదు అన్నారు. వెదురు కుప్పం ఐటి నందు సిఓపిఏ, డ్రెస్ మేకింగ్, మెకానికల్ డీజిల్, పిట్టర్, ఎలక్ట్రిషన్, ఎలక్ట్రానిక్ మెకానిక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## గృహ సారధుల మండల కన్వీనర్‌కు సన్మానం



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తరఫున అహర్నిశలు ప్రచారాన్ని కొనసాగించిన వెదురుకుప్పం గృహసారదుల మండల కన్వీనర్ బట్టి సుబ్రహ్మణ్యం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి సత్కరించారు. సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన అప్పటినుండి నిరంతరంగా మండలంలో 25 పంచాయతీల్లో ప్రచారాన్ని దిగ్విజయంగా కొనసాగించడంతో వైకాపా నాయకులు బుధవారం సన్మానించారు. అనంతరం బట్టే సుబ్రమణ్యం మాట్లాడుతూ వెదురుకుప్పం మండలంలో వైకాపా అభ్యర్థి కృపా లక్ష్మి అఖండ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.

## మామ కోసం... కోడలు
## తండ్రి కోసం కుమార్తె ముమ్మర ప్రచారం

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కె పి ఎస్ వాసు గెలిపించేందుకు ఆయన కోడలు నాగరాజమ్మ, కుమార్తె చంద్రికలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చిన్నగొట్టిగల్లు మండలంలో పలు గ్రామాల్లో వారి పరిధించి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 9 అంశాలను ప్రజలకు తెలియజేసి కాంగ్రెస్ ఓటు వేయాలని కోరారు.
నర్సింగాపురంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కె పి ఎస్ వాసు విస్తృతంగా పర్యటించారు. ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. ప్రతినెల మహిళలకు రూ8,500 అందజేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బహుజన పాలకులతోనే దేశాభివృద్ధి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ =న్యూస్:** దేశంలో బహుజనులు అధికారాన్ని చేపడితే దేశం అభివృద్ధి చెందుతుందని అంబేద్కర్ ధర్మ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్ర రావు అభిప్రాయపడ్డారు. మంగళవారం ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని కార్పొరేట్ కంపెనీలకు జనరల్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని, ఆ కంపెనీలకు ప్రభుత్వ వాటాలను మళ్లించి వారిని బిలీనియర్లుగా మార్చే బాధ్యతను కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. దశాబ్దాలుగా భారతదేశ అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోతోందని, భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం అని చెప్పేవారు మాత్రం కోట్లకు పడగలు ఇస్తున్నారన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాన్ని అడ్డం పెట్టుకుని పేద ప్రజల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామని మాయమాటలు చెప్పి గద్దనెక్కే పాలకులు అధికారం చేపట్టాక పేదల దుస్థితి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అందుకే దేశంలో పేదలు పేదలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఎస్పీ పార్టీ నుండి తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థిగా విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప పోటీ చేస్తున్నారని ఆయన అభ్యర్థిత్వాన్ని తిరుపతి పార్లమెంటు డివిజన్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నాగరాజు, చెంగల్రాయులు, గుణ పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** మండలంలోని పద్మసరస్సు కు చెందిన సీనియర్ నాయకుడు దొరస్వామి రాజు బుధవారం ఉదయం గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రమేష్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచారెడ్డి శివారెడ్డి, యుగంధర్ రాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

# తలకిందులయ్యేనా...? చంద్రబాబు ఛాలెంజ్.!

(మొదటి పేజీ తరువాయి...)

కూడా గెలవలేదు. దీంతో సూళ్లూరుపేట నియోజకవర్గం మహిళలకు కలిసి రాదని అన్ని పార్టీల నేతలు ఓ అభిప్రాయానికి వచ్చి సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి సీట్లు పురుషులకు కేటాయిస్తూ వచ్చారు. దీంట్లో భాగంగా నెలవల సుబ్రహ్మణ్యం కు టిడిపి తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి బి ఫామ్ ఇవ్వాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా ఈ పర్యాయం చంద్రబాబు నాయుడు ఓ ఛాలెంజ్గా తీసుకొని నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె అయిన డాక్టర్ నెలవల విజయశ్రీ కి సీటు ప్రకటించాడు. అయితే ఆమె కూడా గెలిచే పరిస్థితి లేదని చంద్రబాబు నాయుడు ఆలోచన తలకిందులు అవుతుందని ఆ నియోజకవర్గ ప్రజలు ఓటర్లు సాక్షాత్ పార్టీల నేతలు క్రింది స్థాయి కేడర్ నుంచి వినిపిస్తున్న విశ్వసనీయ సమాచారం. డాక్టర్ వృత్తిలో ఉంటూ తిరుపతిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో వైద్య వృత్తి చేసుకుంటూ డాక్టర్ నెలవల విజయ్ శ్రీ ముందుకు వెళుతుంది. అంతే తప్ప ఆమెకు రాజకీయం అంటే ఏమీ తెలియదు. తండ్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎమ్మెల్యేగా పనిచేశాడు నెలవల. తిరుపతి ఎంపీగా కూడా పనిచేసిన అనుభవం ఆయనది. అలాగే టి టి డి బోర్డు మెంబర్గా కూడా నెలవల సుబ్రహ్మణ్యం పనిచేసిన అనుభవం. అయితే నెలవల కుటుంబానికి ఎప్పటినుంచో టిడిపి వర్గంలోని వేనాటి కుటుంబానికి చెందిన ఓ బడా నేత చంద్రారెడ్డి విజయశ్రీ కి సూళ్లూరుపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే ఆయనతెలుగుదేశం పార్టీ నుండి వైసీపీ పార్టీలోకి వెళ్లిపోయాడు. నిలవల సుబ్రహ్మణ్యం తర్వాత వేనాటి చంద్రారెడ్డికి ఇవ్వాల్సిన ఎమ్మెల్యే టికెట్ను చంద్రబాబు నాయుడు వేనాటి చంద్రారెడ్డికి ఇవ్వకుండా చాలెంజిగా నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె డాక్టర్ నెలవల విజయకి సీటు ప్రకటించాడు. అయితే 2024 ఎన్నికల్లో విజయశ్రీ కి రాజకీయం కలిసి వస్తుందా ...? లేకుంటే తిరిగి యధావిధిగా ఆమె డాక్టర్ వృత్తి కే పరిమితం అవుతుందా...? అనేది కొద్ది రోజుల్లో తేలనుంది.

# 41,993 మంది కొత్త ఓటర్లు

(మొదటి పేజీ తరువాయి...)

8,83,330 మంది పురుషులు, 9,29,466 మంది స్త్రీలు, 184 మంది ట్రాన్స్ జండర్లు మొత్తం 18,12,980 మంది. ఇందులో.. 18-19 సం. ఓటర్లు 41,993, సర్వీస్ ఓటర్లు 862, ఎన్.ఆర్.ఐ. ఓటర్లు 291, పి.డబ్ల్యూ.డి. ఓటర్లు 24,596 మంది, 85 సం. పైబడిన ఓటర్లు 7,924 మంది ఉన్నారన్నారు.

### తిరుపతి జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలలోని ఓటర్ల వివరాలు.

**120 గూడూరు ( S C) అసెంబ్లీ నియోజకవర్గం:** 1,19,164 మంది పురుషులు, 1,26,007 మంది స్త్రీలు, 34 మంది ట్రాన్స్ జండర్లు మొత్తం 2,45,205 మంది ఇందులో 18-19 సం. ఓటర్లు 5320, సర్వీస్ ఓటర్లు 36, ఎన్.ఆర్.ఐ. ఓటర్లు 46, పి.డబ్ల్యూ.డి. ఓటర్లు 3174 మంది, 85 సం. పైబడిన ఓటర్లు 1395 మంది ఉన్నారు.
**121 సూళ్ళూరుపేట అసెంబ్లి నియోజకవర్గం:** 1,18,094 మంది పురుషులు, 1,24,492 మంది స్త్రీలు, 24 మంది ట్రాన్స్ జండర్లు మొత్తం 2,42,610 మంది ఇందులో 18-19 సం. ఓటర్లు 5275, సర్వీస్ ఓటర్లు 94, ఎన్.ఆర్.ఐ. ఓటర్లు 28, పి.డబ్ల్యూ.డి. ఓటర్లు 4209 మంది, 85 సం. పైబడిన ఓటర్లు 1081 మంది ఉన్నారు.
**122 వెంకటగిరి అసెంబ్లి నియోజకవర్గం:** 1,18,888 మంది పురుషులు, 1,24,690 మంది స్త్రీలు, 04 మంది ట్రాన్స్ జండర్లు మొత్తం 2,43,582 మంది ఇందులో 18-19 సం. ఓటర్లు 5539, సర్వీస్ ఓటర్లు 55, ఎన్.ఆర్.ఐ. ఓటర్లు 34, పి.డబ్ల్యూ.డి. ఓటర్లు 3490, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 1468 మంది ఉన్నారు.
**166 చంద్రగిరి అసెంబ్లి నియోజకవర్గం:** 1,52,988 మంది పురుషులు, 1,62,109 మంది స్త్రీలు, 62 మంది ట్రాన్స్ జండర్లు మొత్తం 3,15,159 మంది ఇందులో 18-19 సం. ఓటర్లు 8061, సర్వీస్ ఓటర్లు 399, ఎన్.ఆర్.ఐ. ఓటర్లు 49, పి.డబ్ల్యూ.డి. ఓటర్లు 4221, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 1255 మంది ఉన్నారు.
**167 తిరుపతి అసెంబ్లి నియోజకవర్గం:** 1,49,846 మంది పురుషులు, 1,52,622 మంది స్త్రీలు, 35 మంది ట్రాన్స్ జండర్లు మొత్తం 3,02,503 మంది ఇందులో 18-19 సం. ఓటర్లు 6460, సర్వీస్ ఓటర్లు 93, ఎన్.ఆర్.ఐ. ఓటర్లు 94, పి.డబ్ల్యూ.డి. ఓటర్లు 2024, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 1498 మంది ఉన్నారు.
**168 శ్రీకాళహస్తి అసెంబ్లి నియోజకవర్గం:** 1,19,973 మంది పురుషులు, 1,28,549 మంది స్త్రీలు, 14 మంది ట్రాన్స్ జండర్లు మొత్తం 2,48,536 మంది ఇందులో 18-19 సం. ఓటర్లు 6640, సర్వీస్ ఓటర్లు 97, ఎన్.ఆర్.ఐ. ఓటర్లు 21, పి.డబ్ల్యూ.డి. ఓటర్లు 3278, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 653 మంది ఉన్నారు.
**169 సత్యవేడు అసెంబ్లి నియోజకవర్గం:** 1,04,377 మంది పురుషులు, 1,10,997 మంది స్త్రీలు, 11 మంది ట్రాన్స్ జండర్లు మొత్తం 2,15,385 మంది ఇందులో 18-19 సం. ఓటర్లు 4898, సర్వీస్ ఓటర్లు 88, ఎన్.ఆర్.ఐ. ఓటర్లు 19, పి.డబ్ల్యూ.డి. ఓటర్లు 4200 మంది, 85 సం.లు పైబడిన ఓటర్లు 574 మంది ఉన్నారు.

# ఓటమి భయంతోనే నిరాధారమైన ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి...)

వేదికగా బురద జల్లే రాజకీయాన్ని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి, ఆయన అనుచరులు నాపై ఆధారాలు లేని వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. వారు విమర్శించిన వాటిపై నేను కాణిపాకంలో ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన కూడా ఎర్రచందనం స్మగ్లింగ్, లాటరీ టికెట్లు విక్రయాలు, ఇసుక అక్రమ రవాణా, పేకాట లాంటి వాటిని చేస్తూ అక్రమంగా సంపాదించ లేదని ప్రమాణం చేయగలరా అని సవాల్ విసిరారు. ఎన్నికల అధికారులకు సమర్పించిన అఫిడవిట్లో విజయానంద రెడ్డిపైన స్మగ్లింగ్, వనసంపద దోపిడీ, మత కల్లోలాలు కేసులు కలిపి మొత్తం14 పైగా కేసులు ఉన్నాయని, మతక లోహాలకు సంబంధించిన కేసులో సైతం ముద్దాయిగా ఉన్నానని ఆయన సమర్పించారని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో వీటన్నిటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఈ రకమై నటువంటి నిరాధార ఆరోపణల కుట్ర కోణాలకు సోషల్ మీడియాని వేదికగా చేసుకుని తనపై ట్రోల్ చేస్తున్నారని మండిపడ్డారు. వీటన్నిటినీ ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెప్పే బాధ్యత చిత్తూరు ప్రజలు తీసుకుంటారన్నారు. దీంతో పాటు తనపై అసత్య ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ 14 కేసుల్లో ముద్దాయి, పిడి యాక్ట్ నిందితుడు చిత్తూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాజమండ్రి జైల్లో చిప్పకూడు తిన్నాడని ఎద్దేవా చేశారు. పోలీస్ స్టేషన్ కనిపిస్తే షర్టు ఇప్పే కల్చర్‌తో తను స్మగ్లర్ అని తానే గుర్తుంచుకున్నాడని వ్యంగాస్త్రం వేశారు. విజయానంద రెడ్డి ఓటమి దాదాపు ఖరారైందని, ఫ్రస్టేషన్లో ఏం చేయాలో అర్థం కాకుండా చౌకబారు పనులు చేసుకుంటూ దిగజారుడు రాజకీయం చేస్తున్నాడని మండిపడ్డారు. 20 ఏళ్ల క్రితం ఒక లారీ క్లీనర్ గా ఉన్న విజయానంద రెడ్డి ఆనతి కాలంలో అక్రమ వ్యాపారాలు స్మగ్లింగ్ చేసి అక్రమార్జనతో ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ పైన నిరాధారమైన ఆరోపణలకు గట్టిగా విజయానంద రెడ్డికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మే 13న ప్రజలు తమ ఓట్లతో విజయానందరెడ్డిని ఇంటికి సాగనంపుతారని అన్నారు. హుందా రాజకీయం చేయడం వదిలేసి నీచ రాజకీయాలకు పాల్పడుతున్న విజయానంద రెడ్డి తీరును చిత్తూరు నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సి ఆర్ రాజన్, చిత్తూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిశీలకులు పల్లెంటి సునీల్ కుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, జనసేన అసెంబ్లీ కన్వీనర్ దయారామ్, మాజీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు అశోక్ ఆనంద్ యాదవ్, జనసేన నేత అరిఫ్, బీసీ నేత విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రలోభాలకు లొంగం!

**- వైఎస్ఆర్టీయూసి జోనల్ ఇంచార్జి ఎన్.రాజారెడ్డి స్పష్టం**



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** కూటమి జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రలోభాలకు మేము లొంగే ప్రసక్తే లేదని, తామంతా భూమన కుటుంబంతోనే పయనిస్తామని వైఎస్ఆర్టీయూసి జోనల్ ఇంచార్జి ఎన్.రాజారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. చిత్తూరు నుండి వచ్చి ప్రశాంతంగా ఉన్న తిరుపతి వాతావరణన్ని రౌడీ సంస్కృతితో కలుషితం చేస్తున్నారన్నారు. వైసిపి నాయకులను ప్రలోభాలకు గురి చేస్తూ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి కుట్ర ప్రయత్నాలు చేస్తున్నారని, తనను కూడా ఫోన్ చేసి ప్రలోభ పెట్టారని ఆరోపించారు. ఇటువంటి ప్రయత్నాలకు ఏనాడు తలగలేదని భూమన సైన్యం అభినయ రెడ్డి గెలుపు కోసం పనిచేస్తామన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి టీజీడి బోర్డు చైర్మన్‌గా కొన్ని వేల మంది జీవితాలు బాగుపడే నిర్ణయాలను తీసుకున్నారన్నారు. టీటీడీ కార్మికులకు జరుగుతున్న మేలును అడ్డుకోవాలని కుట్రతో ఆరణి శ్రీనివాసులు కోర్టును ఆశ్రయించారని, ఎన్నికల కోడ్ అనంతరం పెంచిన జీతాలు అమలు చేస్తామని అధికారులు చెప్పడంతో ఈ కుట్ర దారులపై టీటీడీ కార్మికులు ఆగ్రహంగా ఉన్నారన్నారు. ట్రాఫిక్ సమస్యను తిరుపతి నగరంలో పరిష్కరించడానికి 20 మాస్టర్ ప్లాన్ రోడ్లు ఇప్పటికే వేశారని, ఇంకా 14 రోడ్లు వేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైయస్సార్ టి యు సి షేక్ మహమ్మద్ రఫీ, తిరుమలరెడ్డి, చంద్రశేఖర్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

# చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దు



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** చంద్రబాబు నాయుడు ఒక మాయలోడు సూపర్ సిక్స్ అనే వాగ్దానాలతో మోసం చేసేందుకు వస్తున్నాడు.తస్మాత్ జాగ్రత్త అని ఓటర్లకు హెచ్చరికలు జారి చేశారు. మన జగన్ మోహన్ రెడ్డి పేదలకు బటన్ నొక్కి 60 వేల కోట్ల రూపాయలను ఒక్క పైసా ఎవరికి లంచం ఇవ్వకుండా వారి ఖాతాలోకి జమ చేయడం జరిగిందన్నారు. మన దేశంలోనే ఒక ప్రత్యేముఖ్యమంత్రిగా కొనియాడపడుతున్నారు. కార్వేటి నగరం మేజర్ పంచాయతీలో ఇంటింటి ప్రచారాన్ని మండల పార్టీ అధ్యక్షులు శేఖర్ రాజు ఎంపీపీ లతా బాలాజీ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడచిన 58 నెలల కాలంలో జగనన్న ఎంతోమంది పేదలకు సంక్షేమ పథకాలు అందించారని మనం ఆయన రుణం తీర్చుకోవడానికి ఈనెల 13నజరగబోవు ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసిఅత్యధికమెజారిటీతో గెలిపించాలని కోరారు ఎమ్మెల్యే అభ్యర్థి కృపా లక్ష్మి నాయకునిగా కాక సేవకునిగాపనిచేసిమీ అందరి మన్ననలు పొందుతానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ సుమతి, వార్డు సభ్యులు మోహన్ కుమారి, రవి ఆరుముగం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# నారాయణ యాదవ్ జన్మదినం వేడుకల్లో ఎస్సీ వి నాయుడు



నారాయణ యాదవ్ జన్మదిన వేడుకల్లో ఎస్సీ వీ నాయుడు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు యస్సి వి నాయుడు ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు నారాయణ యాదవ్ జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు యస్సి వి నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదినం వేడుకలను జరుపుకున్న నారాయణ యాదవ్ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు, సుఖః సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించిన యస్సి. వి నాయుడు శాలువా కప్పి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యస్సివి యువత నారాయణ యాదవ్ కి కేక్ తినిపించి జన్మదినం శుభాకాంక్షలు తెలిపిన యస్సి వి దిలీప్ నాయుడు, యస్సి వి కిరణ్ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ముత్యాల పార్థసారధి, రాజయ్య, బాలాజీ నాయుడు, హరి నాయుడు, ప్రకాష్ నాయుడు, సుబ్రహ్మణ్యం, సురేష్ నాయుడు, వినయ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాన్ కింద కూర్చున్న బీసీలు.!

(మొదటి పేజీ తరువాయి...)

తెరిచాడు.

**బీసీలకు దగ్గరైన నేదురుమల్లి...**

ఇదే సమయంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి బిసి లను అక్కున చేర్చుకున్నాడు. పార్టీలో బిసి లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతిఒక్కరికి దగ్గరవుతున్నాడు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అధిక భాగం ఓటర్లున్న బిసిలను సమయం ఏదైనా, సందర్భం ఏదైనా ముందు వరుసలో కూర్చోబెట్టడంతో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డికి బిసి సామాజికవర్గం జై కొడుతున్నారు. ఎప్పటి లాగే కురుగొండ్ల రామకృష్ణ తీరు ఇలాగే ఉంటే మాత్రం రేపు జరిగే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పాలన్న నిర్ణయానికి బిసి సామాజికవర్గం వచ్చినట్లు వినికిడి.

# ఎస్వీ యూనివర్సిటీలో “మాస్టర్ ప్లాన్ రోడ్లను” రద్దు చేస్తాం!

**-క్రీడా మైదానాన్ని ధ్వంసం చేసినవారికి గుణపాఠం నేర్పాలి**

**-నగర ప్రజలకు విజ్ఞప్తి -బీజేపీ నేత నవీన్**



తిరుపతి అర్బన్, మేజర్ న్యూస్: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ అంటేనే దేశ విదేశాలలో ఒక “బ్రాండ్” ఆ పేరులోనే ఒక “వైబ్రేషన్” వుందని ఎస్వి యూనివర్సిటీతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ ఎస్వీయూ ను “సరస్వతీ నిలయంగా” భావిస్తారని ఇక్కడ చదువుకున్న వారు ఎందరో విద్యార్థిని విద్యార్థులు దేశ విదేశాలలో గౌరవప్రదమైన ఉన్నత ఉద్యోగాలలో పనిచేస్తున్నారని బీజేపీ నేత నవీన్ అన్నారు.శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రాంగణంలో తమ స్వార్థ ప్రయోజనాల కోసం “మాస్టర్ ప్లాన్ రోడ్లలో “భాగంగా 80,100 అడుగుల రోడ్డు క్యాంపస్ లో వేసి తీరుతామని అధికార బలంతో,అహంకారంతో విర్రవీగిన నగరపాలక సంస్థ అధికారులను,అధికార పార్టీ నాయకులను, ఎస్ వి యు లో పనిచేస్తున్న,పదవీ విరమణ చేసిన అధ్యాపకులు,పూర్వ ప్రస్తుత విద్యార్థినీ విద్యార్థులతో పాటు,స్థానిక నాయకులు ప్రజా సంఘాలు ప్రజలు దీటుగా ఎదుర్కొని ఎస్వీయూ విద్యార్థి సంఘాలు “బంద్” కు సైతం పిలుపునిచ్చి ప్రతిఘటించడంతో అధికార పార్టీ నాయకులు అసహనంతో వికృత చేష్టలకు పాల్పడి స్థానిక ప్రజాప్రతినిధుల దిష్టి బొమ్మలకు దహన సంస్కారాలు చేసి నగర ప్రజల చేత “ఛీ” కొట్టించుకున్నారని చీత్కరించారు. ఎస్ వి యు క్యాంపస్ లో మాస్టర్ ప్లాన్ రోడ్లు వేస్తే శబ్ద కాలుష్యం,భారీ వాహనాల రాకపోకలు,రోడ్లపై తోపుడు బండ్లు ఫుడ్ కోర్టులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తారని హాస్టళ్లలో ఉండే మహిళలకు రక్షణ కరువవుతుందని,క్యాంపస్ వాతావరణం కలుషితం అవుతుందని మహా వృక్షాలను తొలగించేస్తారని హెచ్చరించినా,ప్రాదేయపడినా అధికార పార్టీ నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. తిరుపతిలో జరగబోవు ఎన్నికలలో యూనివర్సిటీ ఉద్యోగస్తులు ప్రొఫెసర్ లు పూర్వ,ప్రస్తుత విద్యార్థులు స్థానికులు తమ ఓటు హక్కు ద్వారా అధికార పార్టీ నాయకులకు తగిన గుణపాఠం నేర్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలోని పర్యావరణాన్ని ప్రకృతి సంపదను విద్యార్థిని విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని కొత్త ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే “మాస్టర్ ప్లాన్ రోడ్లను పూర్తిగా రద్దు” చేసే బాధ్యతను ఎన్డీయే కూటమి బిజెపి నేతగా ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని హామీ ఇచ్చారు. ఎస్వీ యూనివర్సిటీలో సుదీర్ఘ కాలంగా చాలీచాలని జీతాలు పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ టైమ్ స్కేల్ ఉద్యోగస్తులకు ఉద్యోగ భద్రత కల్పించి జీతాలు పెంచే బాధ్యతను ఎన్డీఏ కూటమి నేతలు తీసుకునేలా చర్యలు చేపడతానని నవీన్ హామీ ఇచ్చారు. ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ లో మాస్టర్ ప్లాన్ రోడ్లు,ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్ లో భవనాలు ఆపండి మహాప్రభో అని ప్రాథేయపడిన స్థానికుల మాటలను అధికార బలంతో అహంకారంతో పెడచెవిన పెట్టిన వారికి “ఓటు” వేసే ప్రసక్తేలేదని ప్రజలంతా అవకాశం కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

# టీడీపీతోనే గీత కార్మికులకు అభివృద్ధి సాధ్యం

**- ఈడిగ గౌడ్ బీసీ సాధికార సమితి కన్వీనర్ బుస్సా నాగరాజు**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ తోనే గీత కార్మికుల అభివృద్ధి సాధ్యమని ఈడిగ గౌడ్ బీసీ సాధికార సమితి కన్వీనర్ బుస్సా నాగరాజు తెలిపారు. బుధవారం చిత్తూరు నగరం లో కల్లుగీత కార్మికులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న ఈడిగ గౌడ్ బీసీ సాధికార సమితి కన్వీనర్ బుస్సా నాగరాజు

చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కల్లుగీత కార్మికులను ఆదుకునేలా డిక్లరేషన్ ప్రకటించడం ఎంతో అభినందనీయం అన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే కల్లుగీత కార్మికులకు ప్రమాదం సంభవిస్తే చంద్రన్న బీమా ద్వారా 10 లక్షలు ,పెళ్లి కానుక ద్వారా లక్ష రూపాయలు, నీరా ప్రాజెక్టు ఏర్పాటు బ్రాందీ షాపుల్లో 10 శాతం రిజర్వేషన్, కల్లును మత్తు పానీయాల జాబితా నుండి తొలగింపు, శీతల పానీయాల కోవ లోకి చేర్పు వంటి కార్యక్రమాలతో పాటు ఉపాధి హామీ పథకంలో ఈత, తాటి, కొబ్బరి, ఖర్జూర చెట్ల పెంపకాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి కల్లుగీత కార్మికుడికి 4,000 రూపాయల పెన్షన్, గీత కార్మికులకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం, గీత కుల విద్యార్థిని విద్యార్థులకు విదేశీ విద్య పథకం వర్తింపు, తాటికల్లు బెల్లం తయారీ మార్కెటింగ్ గీత కార్మికులకు సంఘ భవనాల ఏర్పాటు గీత కార్మికులకు ఇబ్బంది కల్పించే 767 జీవో రద్దు వంటి కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఈడిగ గౌడ్ బీసీ సాధికార సమితి సభ్యులు రెడ్డప్ప గౌడ్, తులసీరామ్ గౌడ్, హరి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

# శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ముందంజు

**- ఎస్వీయు వీసీ ఆచార్య శ్రీకాంత్ రెడ్డి**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పరిశోధన, అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎస్వీయు సైన్స్ కళాశాల విద్యార్థులు ముందంజలో ఉన్నారని ఎస్వీయు ఉపకులపతి ఆచార్య శ్రీకాంత్ రెడ్డి కితాబిచ్చారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల దినోత్సవ వేడుకలు బుధవారం శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. గత దశాబ్ద కాలంగా ఆగిన కళాశాల దినోత్సవ వేడుకలు మళ్ళీ ఈ విద్యాసంవత్సరం నుంచి ఆచార్య శ్రీకాంత్ రెడ్డి ప్రోత్సాహంతో ప్రారంభించారు. కళాశాల దినోత్సవ వేడుకల సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి 2023-24 విద్యాసంవత్సరంలో సైన్స్ కళాశాలలో జరిగిన పరిశోధనలు, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల వివరాలు తెలియజేశారు. ఎస్వీయూ సైన్స్ కళాశాల ఆచార్యులు 124 జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాత్ర సమర్పణ చేశారని, 24 అవార్డులు ఆచార్యులు పొందరని, 206 పేపర్స్, 7 పేటెంట్స్ పొందారని తెలిపారు. పూర్వ విద్యార్థుల అందచేసిన ఆర్థిక సహకారాన్ని కూడా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య



వంగిమళ్ల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్వీయూ సైన్స్ కళాశాల పరిశోధనలో, అభివృద్ధిలో పేటెంట్స్ విషయాల్లో విశ్వవిద్యాలయంలో ముందంజలో వుందని అభినందించారు. ఈ సదస్సుకు విశిష్టత అతిథిగా విచ్చేసిన యన్ ఏఆర్ యల్ డైరెక్టర్ డా.అమిత్ కుమార్ పాత్ర మాట్లాడుతూ తాను కళాశాల దినోత్సవంలో పాల్గొనడం ఆనందంగా వుందన్నారు. వాలీబాల్, క్రికెట్ , కబడ్డీ మొదలైన క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు అతిథులు మెమొంటోలు అందజేశారు. మధ్యాహ్నం సైన్స్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి అతిథులుగా పాల్గొన్నారు.

# ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం...వెంకటే గౌడను గెలిపించుకుందాం

**గంగవరం, మేజర్‌న్యూస్:** మే 13న జరగబోవు ఎన్నికల్లో పలమనేరు ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి వెంకటే గౌడను అలాగే ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప ను అఖండ మెజార్టీతో గెలిపించుకొనుటకు బుధవారం కలగటూరు పంచాయతీ నందు స్థానిక ఎంపీటీసీ భారతిమహేష్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఇంతవరకు ఎన్నడూ చూడని అభివృద్ధిని ఈ ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో సంక్షేమ పథకాలతో అభివృద్ధిని చూసామన్నారు. సచివాలయ వ్యవస్థ,వాలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత ఒక జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అందుకే మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఇంటింటా కరపత్రాలు అందజేసి ప్రజలకు వైసీపీ ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమాలను, జరిగిన అభివృద్ధి ని వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకుందామని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పంచాయతీ కన్వీనర్ నల్లపరెడ్డి, జమీర్ బాషా, ఎటిఎం నాగరాజు, బాబురెడ్డి, మురళి రెడ్డి, ఆనందబాబు, సుమంత్, చరణ్, నరసింహులు, శివ నాగేంద్ర, నాగరాజు, గోపాల్, పరంధామ, నియాజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎంసీబీ ట్రిప్‌తో
# వీధి దీపాలు వెలగలేదు

**తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నగర పరిధిలోని మంగళం రోడ్డులో వీధి దీపాల నిర్వహణ బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వుంటుందని, ఎంసిబి ట్రిప్ కావడంతో వీధి దీపాలు కొంత సమయంపాటు వెలగలేదని ఎపిఎస్ పిడిసిఎల్ తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ యం. కృష్ణా రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నగర పరిధిలో మంగళవారం రాత్రి రోడ్ షోను నిర్వహిస్తున్న సమయంలో వీధి దీపాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు వివిధ దిన పత్రికల్లో ప్రచురితమైన కథనాలపై ఆయన స్పందించారు. లీలామహల్ ప్రాంతంలో వీధి దీపాల కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఎంసిబి ట్రిప్ అవడంతో వీధి దీపాలు కొంత సమయంపాటు వెలగలేదని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే సమస్యను గుర్తించి వీధి దీపాలను ఆన్ చేశారని, లీలామహల్ మినహా రోడ్ షో కొనసాగిన మిగిలిన ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగుతూ వున్నాయని వివరించారు. రోడ్ షో నిర్వహణ సమయంలో విద్యుత్ శాఖ నుంచి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేదని తెలిపారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నంబరు: 1912కు కాల్ చేసి, విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని సూచించారు.

# పేద ప్రజల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

**తండ్రి సునీల్ గెలుపు కోసం తనయుడు విస్తృత ప్రచారం**

**వాకాడు, మేజర్‌న్యూస్:** పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్దే టీడీపీ లక్ష్యమని గూడూరు మాజీ ఎమ్మెల్యే, గూడూరు యన్ డి ఈ కూటమి టిడిపి అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్ కుమార్ తనయుడు డాక్టర్ జస్వంత్ అన్నారు. వాకాడు మండల పరిధిలోని కోడివాక గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. జాశ్వంత్ మాట్లాడుతూ తన తండ్రి పాశం సునీల్ కుమార్ అందరివాడిగా, పేద ప్రజల అభివృద్ధికి, సంక్షేమం కొరకు పనిచేస్తాడన్నారు. అందరికీ అందుబాటులో ఉంటాడని జస్వంత్ ఓటర్లకు తెలిపారు. సామాజిక పింఛను 4000 కావాలన్నా, చదువుకునే ప్రతి బిడ్డకు పదిహేను వేల రూపాయలు ఆర్థిక సహాయం పొందాలన్నా, ప్రతి మహిళలకు నెలకు 1500 రూపాయలు కావాలన్నా, సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు పొందాలన్నా, ఆర్టీసీ బస్సులో మహిళలు ఉచితంగా ప్రయాణించాలంటే, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం రావాలి, ఈ పథకాలే కాక అనేక సంక్షేమ పథకాలు, రాష్ట్రం అభివృద్ధి కోసం తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. డాక్టర్ పాశం సునీల్ కుమార్ గుర్తు సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములై సంక్షేమ ఫలాలు అనుభవించాలని కోరారు. ఈ రోడ్ షోలో వాకాడు మాజీ జడ్పిటిసి ప్రమీల, టిడిపి నాయకులు కుంచం దయాకర్, గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 30మంది ముస్లీం మహిళలు టీడీపీలో చేరిక

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగరంలోని స్థానిక 30వ డివిజన్ పరిధిలోని అశోకపురంకు చెందిన 30 మంది ముస్లీం మహిళలు వైసీపీని వీడి తెలుగు దేశం పార్టీలో చేరారు. ఈ మేరకు బుధవారం బీవీ రెడ్డి కాలనీలోని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టిడిపి నేత ఎల్బీఐ లోకేష్ రెడ్డిల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సఫీనా బేగం, రేష్మ, మున్నా, ముంతాజ్, ముబారక్ తాజ్, భాను, దిల్షాద్, సల్మా, సోను, ముంతాజ్, రహిమా, బుజ్జి, సుల్తానా, నజిమా, ప్యారీ, జిలానీలు ఉన్నారు. వైసీపీ పాలనలో తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని, జగన్ మోహన్ రెడ్డి వింత పోకడలు, అణచివేత ధోరణిలు నచ్చకుండానే తెలుగుదేశం పార్టీలో చేరామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు అల్లంటి సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# జనసేనలోకి బిల్డర్ ఈశ్వర ప్రసాద్

**- అవినీతిపరులైన తండ్రీ కొడుకులను ఓడించాలి**

**- జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రజల సొమ్ము దేవుళ్ళ సొమ్ము దోచుకుంటూ తన స్వలాభం కోసం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తు అవినీతిపరులైన ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డిని రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చెన్నారెడ్డి కాలనీకి చెందిన బిల్డర్ ఈశ్వర ప్రసాద్ జనసేనలో ఆయనతో పాటు వందమంది జనసేనలో చేరారు. బుదవారం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన ఈశ్వర ప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి ఆరణి శ్రీనివాసులు సాదరంగా ఆహ్వానించారు. తిరుపతిలో అవినీతిపరులైన తండ్రీ కొడుకులను ఎన్నికల్లో ఓడించాలని ఆరణి శ్రీనివాసులు కోరారు. పవన్‌కళ్యాణ్ ఆశయాలు, చంద్రబాబు నాయుడు విజనరీ, మోది అభివృద్ధిని చూసి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, వూకా విజయ్ కుమార్, సరితా నాగరాజు, కేవి రమణతోపాటు ప్రకాష్, ధర్మారెడ్డి, పి.దిలీప్, కుమార్, రాధిక, ఆదిలక్ష్మి, దిలీప్, మురళీ పాల్గొన్నారు.



# వైసీపీ నుంచి జనసేనలోకి బీసీ నేత

**ఆరణి సమక్షంలో మురళికి కండువా కప్పి ఆహ్వానించిన జనసేనాని**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బీసీలకు అండగా నిలుస్తామని గొప్పలు చెప్పిన సీఎం జగన్ నమ్మించి మోసం చేయడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి బీసీలు క్రమేపీ బయటకి వస్తున్న పరిస్థితి. తిరుపతిలో భూమన కుటుంబం పదవులు ఇచ్చి, పెత్తనం వారి వద్దే ఉంచుకుని బీసీలను చిన్న చూపు చూడడంతో ఇమడలేక బీసీలు, కీలకంగా వ్యవహరిస్తున్న కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు వైసీపీ నుంచి కూటమి పార్టీల వైపు తమ గమ్యాన్ని నిర్దేశించుకుంటున్నారు. ఇదే కోవలో జిల్లాకు చెందిన వైసిపి ఉమ్మడి జిల్లా బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షులు నెలవాయి మురళీకృష్ణ గుడ్ బై చెప్పి ఎన్డీఏ కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు సమక్షంలో మంగళవారం రాత్రి ప్రజాగళం రోడ్ షోలో పాల్గొనేందుకు వచ్చిన జనసేనఅధినేత పవన్ కళ్యాణ్ నెలవాయి మురళీకృష్ణకి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుకు బీసీలందరూ ఏక తాటిపై ఉండి అఖండ మెజారిటీతో కూడిన గెలుపుకు కృషి చేయాలన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుపతిలోని బీసీలకు సమిచిత స్థానం కల్పిస్తామని పవన్ భరోసా ఇచ్చారు. జనసేనలో చేరిన నెలవాయి మురళి కృష్ణ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుకు విస్తృత ప్రచారం చేస్తూ గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరణి మధన్ ఉన్నారు.



# అవినీతికి కేరాఫ్ భూమన

దొడ్డి దారిన ఎమ్మెల్యేగా గెలిచి దోచుకుంటున్న వైనం భూమనది

40 వేలు ఫేక్ ఐడి కార్డులు సృష్టించి అధికారులు సస్పెండ్‌కు కారకుడు భూమన

దాడులకు పాల్గొనే సంస్కృతి వైసీపీది

ఆధ్యాత్మిక నగరంలో శాంతి నెలకొల్పడమే ఎన్డీఏ లక్ష్యం

సమావేశంలో ఆరణి శ్రీనివాసులు భూమనపై ఫైర్



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతిలో ప్రజల నుంచి అందని ఆడికి దోచుకుని అవినీతికి కేరాఫ్ ఫొటోస్‌గా భూమన కరుణాకర్ రెడ్డి మారారని, తిరుపతిలో దొంగలు పడ్డారని వారి భారీ నుండి ప్రజలను రక్షించుకోవాలని చంద్రబాబు నాయుడు చెబితే దానిని వక్రీకరించి దిగజారుడు మాటలు మాట్లాడిన నైజం భూమనదని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మండిపడ్డారు. చంద్రబాబు పవన్ కళ్యాణ్‌పై భూమన మాట్లాడిన వైనాన్ని ఖండిస్తూ బుధవారం ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి ఆరణి శ్రీనివాసులు మాట్లాడారు. నగరంలో దొంగలు పడ్డారు అని, వారి నుంచి ప్రజలను రక్షించాలని చంద్రబాబు పిలుపునివ్వడం తప్పేంటని భూమనను ప్రశ్నించారు. కనీసం స్కూటర్ కూడా లేని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలని, టీటీడీలో దొడ్డిదారిన కోట్లు పోగేసుకున్న విషయం వాస్తవమా కాదా అని ప్రశ్నించారు.

2019లో జరిగిన ఎన్నికల్లో దొడ్డిదారిన కరుణాకర్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యారని, ఎమ్మెల్యే అయిన తర్వాత భూకబ్జాలకు, అక్రమాలకు అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు దండుకున్నారని వాక్యానించారు. ఎంపీ ఎన్నికల్లో 40వేల ఫేక్ ఐడికార్డులు సృష్టించి అధికారులను సస్పెండ్‌కు గురిచేసిన చరిత్ర భూమనదని గుర్తు చేశారు. 2009 ఎన్నికల్లో కడప నుంచి వచ్చిన రౌడీలతో తిరుపతిలో రౌడీయిజం చేసి వెంకటరమణపై దాడికి పాల్పడిన ఘనుడు కరుణాకర్ రెడ్డి అన్నారు. అదేవిధంగా కేన్సిస్ హోటల్లో బసచేసిన చిరంజీవిపై 2012లో రౌడీ మూకలతో హల్చల్ చేసి దాడుకు పాల్పడిన వ్యక్తి కరుణాకర్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. 2020లో 50 డివిజన్లో అధికారియంతలను గుప్పెట్లో పెట్టుకుని ఒక్క నామినేషన్ కూడా వేయనీయకుండా అడ్డుకుని ఏకగ్రీవాలకు ప్రోత్సహించిన నీచ చరిత్ర భూమనదన్నారు. మాటకు ముందు చిత్తూరురౌడీలు తిరుపతిలో ఉన్నారని మాట్లాడడం సబబు కాదన్నారు. కడప నుంచి వచ్చి ఎన్ని అక్రమాలకు పాల్పడ్డారని, ప్రజల జోలికొస్తే తాము సహించేది లేదని హెచ్చరించారు. అవసరం అయితే తమ నాయకులు కార్యకర్తలు కరుణాకర్ రెడ్డి అంతు చూస్తారన్నారు. ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని, తిరుమల శ్రీవారి ఆలయ వద్ద ప్రమాణం చేసేందుకు సిద్ధమైతే, అవినీతి జరిగిందని ప్రమాణానికి తాను సిద్ధమన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజలను తన తోటి ఉన్న వైసీపీ నాయకులను ఎన్ని ఇబ్బందులకు గురి చేసిన విషయం ప్రజలందరికీ తెలుసని, ఇకపై మీ మాయ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని తేల్చి చెప్పారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో కడప రాజకీయం చేస్తున్న కరుణాకర్ రెడ్డిని ప్రజలు చీదరించు కుంటున్నారన్నారు. కార్పొరేషన్‌లో టిడిఆర్‌బాండ్లు కుంభకోణంలో భారీ అక్రమాలతో వైసిపి ప్రభుత్వం దోచుకునిందని, ఇది అధికారులతో సహా అందరికీ తెలిసిన విషయమేనన్నారు. తాము అధికారంలోకి వస్తే టిడిఆర్ బాండపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు చేపడుతామన్నారు. రాజకీయాలలో రౌడీయిజం శాశ్వతం కాదని ఈ విషయాన్ని భూముల కరుణాకర్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. టిడిఆర్ బాండ్లు కుంభకోణంలో కర్ణాకర్ రెడ్డి అవినీతితో జైలుకు వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈనెల 13వ తేదీన జరుగునున్న సార్వత్రిక ఎన్నికలలో వైసీపీకి ఓటమి తధ్యమని, కూటమికి వస్తున్న ఆదరణతో 22మందిచే దొంగతనంగా నామినేషన్‌లు వేశారని ఆరోపించారు. జన ఆదరణతో తాము అధికారం చేపట్టడం ఖాయమని, నిజాయితీతో కాంట్రాక్ట్ వ్యాపారం చేసి బతుకుతున్న తనపై అవాస్తవాలు మాట్లాడడం కరుణాకర్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. తిరుపతిలో జరిగే ఎన్నికలకు కేంద్ర బలగాలు కెమెరాల పరిరక్షణలో ఉండడం వలన ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆటలు సాగవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ మోహన్, జనసేన పరిశీలకులు కూరగాయల లక్ష్మీపతి, బిజెపి నాయకులు అజయ్ కుమార్, కిరణ్ రాయల్, వట్టిగుంట శంకర్ నారాయణ, రాజారెడ్డి పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారిని టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనాజైస్వాల్ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల నైనా జైస్వాల్ మాట్లాడుతూ శ్రీవారిని దర్శించుకోవడం చాల సంతోషంగా ఉందని అన్నారు. గోవిందా నామాలకు అంతులేదని చెప్పారు. మనసులో ఎంత బాధ ఉన్నా.. శ్రీవారి సన్నిధికి వస్తే బాధలన్నీ మాయమయి పోతాయన్నారు. గోవిందా గోవిందా అంటే అష్టకష్టాలు దూరమవుతాయన్నారు. గోవిందుని సన్నిధికి చేరుకుంటే అన్నివిధాలా అందుకుంటారని తెలిపారు. ప్రపంచంలోనే నాకు చాల ఇష్టమైన ప్రదేశం తిరుమల అంటూ ఆమె తెలిపారు. వచ్చే వారంలో టర్కీలో టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం కానుందని ఆ టోర్నమెంట్‌లో తను పాల్గొనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ ముందు స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చానని చెప్పారు.



## శ్రీవారి సేవలో తమిళనాడు టూరిజం మంత్రి రామచంద్రన్



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారిని తమిళ నాడు టూరిజం మంత్రి రామచంద్రన్ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## జోరుగా దివాకర్ రెడ్డి ఎన్నికల ప్రచారం

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని విజయం కోసం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం దుర్గ సముద్రం పంచాయతీ అడపారెడ్డి పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా దివాకర్ రెడ్డికి టిడిపి, జనసేన నాయకులు, స్థానికులు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం ప్రతీ ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ టిడిపి మతకాలను వివరిస్తూ సైకిల్ గుర్తు కు ఓటు వేసి పులి వర్తి నాని ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రహ్లాద రెడ్డి, వెంకట ముని రెడ్డి,బాబు రెడ్డి, జై ప్రకాష్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి పట్టాభి రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, సురేష్ రెడ్డి, దుర్గ సముద్రం, అడపారెడ్డిపల్లి గ్రామవాసులు పాల్గొన్నారు.



## టీడీపీతోనే బీసీల అభ్యున్నతి : శ్రీనివాసులు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని, మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలందరూ మద్దతుగా నిలిచి గెలుపుకు కృషి చేయాలని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.శ్రీనివాసులు యాదవ్ కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రగిరి నియోజకవర్గంలో టిడిపి బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. టిడిపి తిరుపతి రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలు రామంజేరి, మహేశ్వరి మాట్లాడుతూ దేశ ప్రజలు ఉమ్మడి మేనిఫెస్టోని జనసేన, టిడిపి తీసుకొచ్చాయన్నారు. బీసీలకు పెద్దపీట వేస్తున్నామని కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు, విధులు, కార్యాలయాలు కూడా కేటాయించలేదన్నారు. గతంలో ఆదరణ పథకం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలకు న్యాయం జరిగిందన్నారు. మద్యం ధరలు పెంచి ఆడవాళ్ళ పుస్తెలు తెగిపోయేలా నాసిరకం మద్యాన్ని సరఫరా చేస్తున్నారని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భావితరాల యువతను గంజాయి, డ్రగ్స్ కు బానిసలుగా చేసి వారి జీవితాలను పాడు చేశారని ఆరోపించారు. చంద్రగిరి బీసీ సెల్ ఉపాధ్యక్షులు సుబ్బు యాదవ్ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా బీసీలపై దాడులు పెరిగిపోయాయని, వాటిని నిలువరించడానికి బీసీలకు రక్షణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు పూర్తిగా అధికారులు తొలగించలేదని, పోలింగ్ రోజున గుర్తు తెలియని ఓట్లను వేయడానికి వచ్చిన వారిని అడ్డుకుంటామన్నారు. దొంగ ఓట్ల పరిశీలనలో కానరాని వారు నేడు ఓటర్ స్లిప్పులు వచ్చిన తర్వాత వారి స్లిప్పులను తీసుకెళ్లారన్నారు. పరిశీలనలో కనబడని వారు స్లిప్పుల సేకరణకు మాత్రం ఎలా వచ్చారో అర్థం కావడం లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మునిరత్నం రెడ్డి, మునిక్రిష్ణారెడ్డి, తిరుమల నగర్ పంచాయతీ అధ్యక్షులు గోవిందరాజులు, సుధాకర్, సురేష్ యాదవ్, విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా దొడ్ల కరుణాకర్ రెడ్డి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ తిరుపతి రూరల్ మండలం ఆర్గనైజింగ్ సెక్రటరీగా దొడ్ల కరుణాకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం టిడిపి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు సిఆర్ రాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కష్టపడి అఖండ మెజారిటీతో గెలిపించడానికి అంకితభావంతో పని చేస్తానన్నారు. అధికార పార్టీ ఎన్ని కుట్రలో కుతంత్రాలు పందిన విజయం కోటమీదేనని ధీమా వ్యక్తం చేశారు.

## కూటమితోనే తిరుపతి అభివృద్ధి : సుబ్బరామయ్య

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** టిడిపి జనసేన బిజెపి మూడు పార్టీల కలయికతోనే తిరుపతి



అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని టిడిపి నేత సింగంశెట్టి సుబ్బరామయ్య పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతికి వచ్చిన పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడులకు అబ్బన్న కాలనీ వద్ద సింగంశెట్టి సుబ్బరామయ్య నేతలు ఆర్ కేశవులు పి.సురేంద్ర రాజు వెంకట రాయల్ ఎల్ఐసి సురేష్ లతో కలిసి ఘన స్వాగతం పలికాడు. రానున్న ఎన్నికల్లో కూటమి గెలిస్తేనే ఏపీతోపాటు తిరుపతి అన్ని విధాలుగా ముందుకు వెళుతుందని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా ఆరనిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని స్పష్టం చేశారు.

## వైసీపీ నుంచి కొనసాగుతున్న వలసలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి జనసేన పార్టీలోకి వలసలు బాట పట్టారు. ఇందులో భాగంగా బుధవారం 30వ వార్డుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుకులు జంగం శ్రీనివాసులు రెండు వందల మంది పార్టీలో చేరారు. శ్రీనివాసు అతని అనుచరులకు పార్టీ కండువా కప్పి తెలుగుదేశం, బిజెపి బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఆహ్వానించారు.



పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనకు తామంతా జనసేనలో చేరినట్లు జంగం శ్రీనివాస్ తెలిపారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ గెలుపుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. నెహ్రునగర్ లోని శ్రీనివాసులు ఇంట్లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, ఊక విజయ్ కుమార్, నైనార్ శ్రీనివాస్, కట్టా జయరాం, సరితా నాగరాజు, బండ్ల లక్షీపతి రాయల్, ప్రవీణ్, జంగం గురుకుమార్, మోహన్, నాగరాజు, ఎంఆర్ అనీల్, గుణకుల పాండురంగ పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుడు సేవలో నిర్మాత గౌరీ కృష్ణ దంపతులు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం స్వామి అమ్మ



వారి సేవలో ప్రముఖ సినీ నిర్మాత గౌరీ కృష్ణ బుధవారం శ్రీకాళహస్తీ శ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి దేవస్థానం అధికారులు దర్శనం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మన ఊరు పోలిమేర-2 సినిమా ప్రజల ఆదరణ పొందడం వలన శ్రీ కాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలిపారు. మన ఊరి పొలిమేర పార్ట్ 2 సినిమాకి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించండి

**- 27వ డివిజన్లో బీజేపీ విస్తృత ప్రచారం**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, బిజెపి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని 27వ డివిజన్ పెద్దకాపు లే అవుట్ బూత్ నెంబర్ 82, 83, 85 పరిధిలో భారతీయ జనతా పార్టీ గంగమ్మ గుడి శక్తి కేంద్రా ఇంచార్జ్ గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం చేపట్టారు. బిజెపి సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, మహిళా మోర్చా నాయకురాలు విద్యలు పాల్గొని గాజు గ్లాసు గుర్తుపై, కమలం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ఇంటింటా కరపత్రాలు పంచి ప్రచారం అభ్యర్థిస్తూ ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తూ కేంద్రంలో మళ్ళీ మోడీ ప్రధాన మంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కళ్యాణి, ప్రసాద్, కామసు బాబు, వాసు, టి.సుబ్రహ్మణ్యం, చంద్రబాబు యాదవ్, విద్యా, రమణమ్మ, లక్ష్మి, గౌతమి, ప్రసాద్, ఏ వన్ మస్తాన్, రమణప్ప, చంగల్ రాయలు, నాధముని, పీరంబాయి, రహీం భాయ్ పాల్గొన్నారు.



## ఏ వన్ అండ్ బిగ్ డేటా అనలిటిక్స్‌పై వర్క్‌షాప్



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏవన్ పట్ల అవగాహన పెంపొందించేందుకు గాను, అపోలో విశ్వవిద్యాలయంలోని స్కూల్‌ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఏ వన్ అండ్ బిగ్ డేటా అనలిటిక్స్‌పై ఒక-రోజు వర్క్‌షాప్ నిర్వహించింది. వర్క్‌షాప్ నందు విద్యార్థులు తమ భవిష్య కార్యాచరణకు గాను బి.టెక్‌లో సరైన కోర్సులను ఎంచుకోవడంలో మార్గనిర్దేశం చేయడం లక్ష్యంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మే 8, 2024న జరిగిన ఈ వర్క్‌షాప్‌లో చిత్తూరు జిల్లా పరిసర ప్రాంతాలలో ఉన్న వివిధ జూనియర్ కళాశాలల నుండి ఏ వన్ బిగ్ డేటా అనలిటిక్స్ రంగాలను పరిశోధించడానికి ఆసక్తిగా ఉన్న 200 మంది ఔత్సాహిక విద్యార్థులు పాల్గొన్నారు. మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ శ్రీకాంత్ ప్రభుతో కార్యక్రమానికి హాజరైన వారందరికీ జ్ఞానోదయమైన అనుభూతిని కలిగింపచేశారు. ప్రొఫెసర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఏ వన్ ఆధారిత ప్రపంచంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఏ వన్ రంగంలో తన నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన ప్రొఫెసర్ శ్రీకాంత్ ప్రభు వర్క్‌షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా వర్క్‌షాప్‌లో ఏ వన్ యొక్క ప్రాథమిక అంశాలు, వివిధ పరిశ్రమలలో దాని అప్లికేషన్‌లు నేటి డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌లో బిగ్ డేటా అనలిటిక్స్ యొక్క ప్రాముఖ్యతతో సహా అనేక అంశాల శ్రేణిని ఇంటర్మీడియట్ విద్యార్థులకు. ఇంటరాక్టివ్ సెషన్‌లు, ఆచరణాత్మక ప్రదర్శనలు మరియు ఆకర్షణీయమైన చర్చల ద్వారా, పాల్గొనేవారు ఈ అత్యాధునిక సాంకేతికతలు మరియు వాటి వాస్తవ-ప్రపంచ చిక్కుల గురించి లోతైన అవగాహనను పొందారు. అదనంగా, అపోలో యూనివర్సిటీ అధికారులు, గౌరవనీయ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ వినోద్ భట్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.సునీల్ కుమార్ ఈ వర్క్‌షాప్‌లో మరింత సబ్జెక్టుపై సుసంపన్నమైన పరిజ్ఞానాన్ని అందించి వర్క్‌షాప్ కు విచ్చేసిన విద్యార్థులకు ప్రశంసించారు. ప్రొఫెసర్ సేతురామ సుబ్బయ్య, కంట్రోలర్ ఆ ఎక్సమినేషన్స్ విద్యార్థిని, విద్యార్థులకు 3 రూల్ ఫర్ సక్సెస్ గురించి సలహాలిచ్చారు.వర్క్‌షాప్ విజయం సాంకేతిక విద్యలో ఆవిష్కరణ శ్రేష్ఠతను పెంపొందించడానికి టిఎయూ యొక్క కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం యొక్క ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.హిమబిందు, డా.వివేకానందన్, డా. జగదీశాన్ డా.శ్రీరామన్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఏ వన్ బిగ్ డేటా నైపుణ్యం కోసం డిమాండ్ పెరుగుతూనే ఉన్నందున, పరిశ్రమ యొక్క భవిష్యత్తును రూపొందించడంలో తదుపరి తరం ఇంజినీరింగ్ విద్యార్థులలో శక్తివంతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతుందని భావించి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు అఖండమైన స్పందన రావడం పట్ల డాక్టర్ ఇలియాస్ అలీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించడానికి ప్రోత్సహం అందించిన ప్రొఫెసర్ ఎం. పోతరాజు, రిజిస్ట్రార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పి నరేష్ కుమార్ రెడ్డి ప్రముఖులకు ఇంకా ఈ వర్క్‌షాప్‌ను సహకరించిన బోధన బోధనేతర ధన్యవాదాలు తెలిపారు.

# ఆసుపత్రిలో రికార్డులు పరిశీలన

**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని రెండు యూపీఎస్సీలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభావతి ఆకస్మికంగా తనిఖీచేశారు. అందులో నడుపుతున్న సేవలపై ఆరా తీయడం జరిగిందన్నారు. అలాగే రికార్డులను పరిశీలించి వాటిని మెరుగైన నివేదికలు తయారు చేయాలని సూచించారు. మరలా యూపీఎస్సీ కాకా తోపు కొత్త భవనమును పరిశీలించి వీలైనంత త్వరగా దానిని హ్యాండ్ ఓ ఆర్ ఎస్ ను అక్కడి నుండి సేవలు అందించాలని సూచించడం జరిగింది. యూపీఎస్సీ పాత పేట పరిధిలోని ఓల్డ్ పేట టు, ఓల్డ్ పేట సచివాలయాలను సందర్శించడం జరిగినది. ప్రతి బుధవారము తప్పనిసరిగా సచివాలయాలలో చిన్న పిల్లలకు వ్యాక్సిన్ ను వేయాలనిసూచించారు. అలాగే డ్యూ లిస్టును తయారు చేసుకుని ఒకరోజు ముందుగా వారికి తెలియజేసి వారు బుధవారం ఉదయం 9 గంటలకల్లా సచివాలయానికి వచ్చి వ్యాక్సిన్ వేసుకున్నట్లు ఆశాల ద్వారా ప్రచారము చేయాలని సూచించడం జరిగిందన్నారు. అలాగే సచివాలయ రికార్డులను తనిఖీ చేయడం జరిగినది. అనంతరం కమల్ స్కానింగ్ సెంటర్‌ను డాక్టర్ జయభారతి దేవి స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. తప్పకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఉష్ణోగ్రతల ఎక్కువగా ఉన్నందున ప్రజలలో వడదెబ్బపై అవగాహన కల్పించాలని వారికి తగిన విధంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను తమ వద్ద చిత్తముగా ఉంచుకొని ప్రజలకు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ నిరంజన్ కుమార్, డాక్టర్ ఆశ, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.



# నరసింహారెడ్డి కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

**పెనుమూరు, మేజర్‌న్యూస్:** మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షుడు మహాసముద్ర నరసింహారెడ్డి కుటుంబాన్ని పలువురు ప్రముఖ నేతలు బుధవారం పెనుమూరు మండలం పులికల్లు పంచాయతీలోని నరసింహారెడ్డి స్వగ్రామంలో పరామర్శించారు. గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపా లక్ష్మి, మొదలియార్ సంఘ చైర్మన్ బుల్లెట్ సురేష్, లు ప్రముఖులు అనారోగ్యంతో మృతి చెందిన నరసింహారెడ్డి పార్థివ దేహానికి ఘనంగా గజ మాలలతో నివాళులర్పించారు. అనంతరం నరసింహారెడ్డి కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతి తెలుపుతూ నరసింహారెడ్డి కుమారులైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు దయాసాగర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ విజయ్ కుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యుడు దూది మోహన్, నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు యశోద రెడ్డి, సర్పంచ్ జయ చంద్రారెడ్డి, యువత మండల మాజీ అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, యువత మండల అధ్యక్షుడు లోకేష్ రెడ్డి పెద్ద రాసిపల్లి నరసింహారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీలో చేరిన వైస్ ఎంపీపీ చక్రాల గోపి యాదవ్

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నియోజకవర్గంలో అధికార పార్టీ వైసీపీకి రోజురోజుకు షాక్‌లు మీద షాక్‌లు తగులుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం వైస్ ఎంపీపీ చక్రాల గోపి యాదవ్ ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేసి సైకిల్ ఎక్కారు. చక్రాల గోపి యాదవ్ కు తెలుగుదేశం పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పల్లెంటి సునీల్ కుమార్ బీవీ రెడ్డి కాలనీలోని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నివాసంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



## మేమంతా... పులివర్తి నాని వెంటే!

**- నెత్తకుప్పం నుంచి జోరుగా వలసలు**

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సరైన గుర్తింపు, గౌరవం లేదని మేమంతా... పులివర్తి నాని వెంటే నడుస్తామని రామచంద్రాపురం మండలం, నేత్తకుప్పం పంచాయతీ యల్‌విపురం(కట్లకనం) గ్రామానికి చెందిన వైసీపీ నేతలు అన్నారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం, రఘునాథ్ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో వైసీపీ నాయకులు భార్గవి, నాగమణి, సంపూర్ణమ్మ, పద్మ, గౌరమ్మ, వెంకటమ్మ, గోవిందమ్మ, గురమ్మ, అమ్మనెమ్మ, జ్ఞానమ్మ, ధర్మ రెడ్డి, ధన లక్ష్మి, రాజమ్మ, ముని లక్ష్మి, గీత, సాకేలే, సుమతి, కృష్ణయ్య, బుచ్చి రెడ్డి, సావిత్రమ్మ, దేవి, అరుణాథ రెడ్డి, మోహన్ రెడ్డిలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రజలనే కాకుండా సొంత క్యాడర్‌ను కూడా రెండు సార్లు మోసం చేశారని పార్టీలో చేరిన వారన్నారు. పంచాయితీలో టీడీపీకి మెజార్టీ తీసుకు వస్తామని ధీమా వ్యక్తం చేశారు.



## చిట్రెడ్డిపల్లిలో గంగ జాతర

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** చౌడేపల్లి పరిధిలోని చిట్టిరెడ్డి పల్లిలో బుధవారం ఘనంగా గంగ జాతరను నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన జాతరలో పలు కార్యక్రమాలు జరిగాయి. మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు తెల్లవారుజామున మహిళలచే దీపారాధన విశేష దర్శనము జరిగాయి. ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంగ జాతరను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు జాతరను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ప్రతి వీధిలోను మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ రంగురంగుల పూలతో దివ్యాంగ సుందరంగా అలంకరించారు అమ్మవారిని చూసేందుకు ఈ ప్రాంతం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామస్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.



## కూటమి అభ్యర్థులను గెలిపించండి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం బిజెపి బలపరుస్తున్న ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌లను గెలిపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. ప్రచారంలో భాగంగా బుధవారం 10 11 డివిజన్ పరిధిలోని పెద్దకాపులే అవుట్లో ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ఆరణి శ్రీనివాసులుకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని వైసిపిని సాగనం పాలని ప్రజలను కోరారు. రానున్న ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ సూపర్ సిక్స్ మేనిఫెస్టో లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయ కులు నెలవాయి మురళీకృష్ణ, టిడిపి నాయకులు కంకణాల రజనీకాంత్ నాయుడు, దొడ్డ రెడ్డి రామకృష్ణారెడ్డి, జలపోతు చంద్రశేఖర్ రెడ్డి, గాలి పవన్ చౌదరి, భారతి, చందు, ఆ వార్డులోని ప్రజలు పాల్గొన్నారు.



## జోరుగా వైఎస్ఆర్సీపీ ఎన్నికల ప్రచారం

**కోట, మేజర్‌న్యూస్:** ఎన్నికల పోలింగ్‌కు రోజులు దగ్గర పడడంతో వైయస్సార్సీపి నాయకులు గ్రామాల్లో ముమ్మ రంగ ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని కొక్కుపాడు పంచాయితీలోని పలు గ్రామాల్లో వైయస్సార్సీపి సీనియర్ నాయకులు యరటపల్లి మధుసూదన్ రెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి పర్యటించి జగన్ తోనే సంక్షేమ పాలన సాధ్యమని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. వైఎస్ఆర్సిపి గూడూరు నియోజకవర్గ అభ్యర్థి మేరీగా మురళీధర్, పార్లమెంట్ అభ్యర్థి మద్దెల గురుమూర్తిని మే 13వ తేదీ మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు యరటపల్లి మధుసూదన్ రెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు వంశీ కృష్ణారెడ్డి, బంగారు రెడ్డి, హరిబాబు రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దశరథరామిరెడ్డి, నాగరాజు, హరిబాబు, సంజీవి, ప్రసన్న కుమారి, భార్గవి, స్వరూప్, దర్శి మస్తానయ్య వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నాన్న గెలుపునకు యాదవులు కృషి చేయండి

**యువనేతకు జన నీరాజనాలు**
**అడుగడుగున మహిళల మంగళ హారతులు**
**పులివర్తనాని గెలుపు కోసం**
**బడి సుధా యాదవ్ విస్తృత ప్రచారం**

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానినీ గెలిపించడానికి యాదవులు కృషి చేయాలని రాష్ట్ర ఓబిసి కన్వీనర్, టిడిపి యువ నాయకుడు బడి సుధా యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం బొప్పరాజు పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం ఘనంగా నిర్వహించారు. ఆయనను తెలుగు యువత సత్రం మిట్ట వద్ద ఘన స్వాగతం పలికి భారీ స్థాయిలో బైక్ ర్యాలీతో బొప్పరాజు పల్లి గ్రామానికి తీసుకొచ్చారా, అనంతరం ఆయన ప్రతి ఇంటికి తిరిగి ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నానికి ఒక అవకాశం కల్పించాలని కోరారు. ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటు వేసి పులివర్తి నానిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనుప్పల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు జవాది ప్రకాష్ యాదవ్, పాలపర్తి బాబు యాదవ్, సిద్ధయ్య యాదవ్, అజిత్ యాదవ్, సోము రాయల్, యోగ యాదవ్, భాస్కర్ రాయల్, బాబురాయల్, మహేష్ రాయల్, కానాల ప్రసాద్ రెడ్డి, కొర్లకుంట నరసింహారెడ్డి, చిట్టిబాబు రాయల్, ముని రాజా యాదవ్, దేవ రాజులు రాయల్, రూపు రాయల్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కూటమి అభ్యర్థులను గెలిపించండి



**కోట, మేజర్‌న్యూస్:** మే 13వ తేదీ జరగనున్న సాధారణ ఎన్నికల్లో తిరుపతి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డాక్టర్ వెలగంపల్లి వరప్రసాద రావు, గూడూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సునీల్ కుమార్ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. బుధవారం మండల పరిధిలోని శ్యామసుందర పురంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భూత్ ఇంచార్జిలు తల్లం శ్రీనివాసులు, ముసునూరు వంశీ, ముసునూరు ముని రాజా, నందం మోహన్ ఇంటింటి ప్రచారం నిర్వహించి బిజెపి, జనసేన, టిడిపి అభ్యర్థుల డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు కమలం గుర్తుపై పాశం సునీల్ కుమార్ సైకిల్ గుర్తులపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

## కల్లూరులో వైసీపీ నాయకుల ప్రచారం

**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడు మండలం కల్లూరు పంచాయతీ పరిధిలోని సిద్ధిగుంట పాలెం, పల్లిపాలెం, కల్లూరు కొత్తపాలెం, సాయిబులపాలెం గ్రామాలలో వైసీపీ నాయకులు, కల్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి వెళ్లి గూడూరు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి మేరిగ మురళి, తిరుపతి యంపి అభ్యర్థి గురుమూర్తిలకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వాకాడు ఏఎంసి డైరెక్టర్ వాకాటి జనార్దన్ రెడ్డి, పెళ్లూరు కోటీశ్వర్ రెడ్డి, పాకం భాస్కర్ రెడ్డి, శేషారెడ్డి, మారు బోయిన సురేష్ ప్రతాప్‌లు ఇంటింటి ప్రచారం నిర్వహించి జగనన్న కరపత్రాలు పంచారు. సర్పంచ్ దువ్వూరు విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కల్లూరు పంచాయతీ పరిధిలో వైకాపాకు అత్యధిక మెజార్టీ తీసుకొస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం అభ్యర్థులదే అన్నారు.



## కూటమికి ఓటు వేస్తే ముస్లింల బతుకులు నాశనం

**ముస్లిం మైనారిటీ నేతల పిలుపు**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ముస్లింలపై కక్ష్య సాధింపు ధోరణితో బీజేపి వ్యవహరిస్తూ నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దు చేసేందుకు ప్రయత్నిస్తుంటే బీజేపీ పొత్తుతో కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ముస్లింలను సైతం దగా చేయడమేనని, అలాంటి కూటమికి ఓటు వేస్తే యావత్ ముస్లింల జీవితాలు సర్వనాశనమవుతాయని మైనారిటీ నేతలు స్పష్టం చేశారు. బుధవారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ సయ్యద్ షఫీ అహ్మద్, రాష్ట్ర అధికారప్రతినిధి ఎస్.ఖాదర్ బాషా మాట్లాడుతూ ముస్లింల పట్ల కూటమి నేతలు అవలంబిస్తున్న దుర్మార్గపు కుట్రల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో 14 ఏళ్ల టీడీపీ పాలనలో ముస్లింలను వంచనతో దగా చేసిన చరిత్ర చంద్రబాబుదేనన్నారు. కేవలం ముస్లిం తోఫా పేరుతో సేమియా, చక్కెర, నెయ్యి మైనారిటీల ముఖాన విదిల్సి మోసం చేసిన విషయాన్ని యావత్ ముస్లిం జాతి గుర్తించుకోవాలన్నారు.



గత 10 ఏళ్ల బీజేపీ పాలునలో సైతం ముస్లిం మైనారిటీలను నవంచన చేయడమేకాక ప్రస్తుతం ముస్లిం జీవితాలను అంధాకరంలో నెట్టి ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. స్వలాపేక్షతో చంద్రబాబుకు తొత్తుగా మారిన జనసేన పవన్ కల్యాణ్ ముస్లింల ఊసెత్తకపోవడం మరింత దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. అధికారమే లక్ష్యంగా కుట్రలు కుతంత్రాలతో దుర్మార్గపు రాజకీయ ఎత్తుగడులు వేస్తున్న కూటమిని నమ్మితే ముస్లింల మైనారిటీల జీవితాలు ప్రశ్నార్థంగా మారే పరిస్థితి ఉందన్నారు. ఈనెల 13న జరుగనున్న ఎన్నికలు యావత్ ముస్లిం నేతలకు ఎంతో కీలకమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. హక్కుల సాధన కోసం రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును విజ్ఞతతో ఆలోచించి సద్వినియోగం చేసుకోవా ల్సిన అవశ్వత ఉందన్నారు. గత ఐదేళ్లుగా ముస్లింలను అక్కున నేర్చుకొని వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్రెడ్డి అని తెలిపారు. నేటి ఎన్నికల వేశ ముస్లింలల్లో అభద్రతాభావం నెలకొందని తెలిపారు. అయితే కొవ్వూరు సభలో ముఖ్యమన్నార వైఎస్.జగన్ మోహన్రెడ్డి మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు వచ్చినా ముస్లింల రిజర్వేషన్ కొనసాగిస్తానని.. ముస్లిం జాతిని దగా చేసే కేంద్రం తెచ్చిన నల్లచట్టాలను అమలు చేయనని భాహాటకంగా ప్రకటించి మైను ముస్లిం పక్షపాతిగా నిలిచారని తెలిపారు. ముస్లింల సంక్షేమ సారథి జగనన్నకు ముస్లింలు అండగా నిలిచి వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం విజయంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కూటమికి ఓటు వేస్తే ద్రోహం, కాంగ్రెస్కు ఓటు వేస్తే వృధా, వైఎస్ఆర్సీపీకి ఓటు వేస్తే న్యాయమన్న విషయాన్ని ముస్లిల మైనారిటీలు గుర్తించి జాగృతతో ప్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో ముస్లిం మైనారిటి నాయకులు గఫూర్, ఎస్.అన్వర్, షరీఫ్, నిషాన్, ముతవల్లి ఏజీకే మాలిక్ పాల్గొన్నారు.

# శ్రీవారి సేవకు భూమన అనర్హుడు

- ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ గేటు తగ్గింపుకు చర్యలు చేపడతాం
- మార్కెట్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తాం :ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** సాక్షాత్తు కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామి సేవకు టిటిడి చైర్మన్ కరుణాకర్ రెడ్డి అనర్హుడు, టిటిడి చైర్మన్‌గా ఉండి తన పుత్రుడు అభినయ గెలుపు కోసం అడ్డ దారుల్లో కమిషన్లతో దోచుకుని వ్యక్తిత్వం భూమన నైజం అని తెలుగు దేశం...బిజెపి బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మండిపడ్డారు. దౌర్జన్యాలు, కబ్జాలు, గంజాయి అమ్మకాలతో భూమున కరుణాకర్ రెడ్డి కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. బుధవారం ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ లో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రచారం నిర్వహించారు. అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డీల ఆధ్వర్యంలో ప్రతి దుకాణానికి వెళ్లి కరపత్రాలు



పంచుతూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారానికి వచ్చిన ఆయనను మార్కెట్ వ్యాపారులు కూరగాయలతో ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ గజములను క్రేన్ సాయంతో వేసి పోలో వర్షం కురిపించి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. జనసేన ఎన్నికల గుర్తైన గాజు గ్లాసుపై ఓటేసి గెలిపించాలని శ్రీనివాసులు కోరారు. కూరగాయలను స్వయంగా తూకం వేసి కొనుగోలుదారులకు కూరగాయలు అందజేశారు. వారి సమస్యలు అన్ని తెలుసుకుని సాలుకూలంగా స్పందించారు. ఈసందర్భంగా ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబు నుంచి వచ్చిన తాను కూరగాయలు అమ్మినట్లు చెప్పారు. కూరగాయలు అమ్మడం తప్పైనట్లు భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంట్రాక్టర్ గా న్యాయబద్ధంగా సంపాదించినట్లు, మీలాగా సెటల్మెంట్స్, కబ్జాలు, గంజాయి అమ్మకాలతో కోట్ల రూపాయలు సంపాదించలేదని విమర్శించారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో తాగునీటి సమస్యను ప్రభుత్వం వచ్చిన రెండునెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. వ్యాపారస్థుల కోసం షెడ్స్ కట్టించనున్నట్లు తెలిపారు. గేట్ రేటును వైకాపా నాయకులు పెంచేశారని ప్రభుత్వ ధరనే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పులిగోరు మురళీకృష్ణా రెడ్డి, నాయుడమ్మ, బిజెపి నాయకులు భానుప్రకాష్ రెడ్డి, జనసేన నాయకులు లక్షీపతి రాయుల్, మాధవరం, అన్నారెడ్డి క్రిష్ణారెడ్డి, జానికి రామ్ రెడ్డి, బిఎస్ బాలాజీ, ప్రకాష్, సాంబ, శివకుమార్ పాల్గొన్నారు.




## శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి జాతరకు
# పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** మే 14 నుంచి 22 వ తేదీ వరకు జరిగే శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరకు సంబంధించి సంబంధిత శాఖల విభాగాలు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్ల ను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్, డిఆర్ఓ పెంచల్ కిషోర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి జాతరకు సంబంధించి సంబంధిత శాఖల విభాగాలు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్ల చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జీ ఓ నంబర్ 9 మేరకు శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా రద్దీ దృష్ట్యా సంబంధిత శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జాతర సందర్భంగా శానిటేషన్ నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్యూ లైన్ నియంత్రణ, కంట్రోల్ రూం ఏర్పాటుతో పర్యవేక్షణ, పార్కింగ్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, మెడికల్ క్యాంపు లు ఏర్పాటు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచడం, త్రాగు నీరు, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఫైర్ సేఫ్టీ, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ అనౌన్స్మెంట్, రవాణా సౌకర్యం తదితర అంశాలపై ప్రణాళికలు బద్ధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. శానిటేషన్, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాట్లపై మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతర ముగింపు రోజులలో భక్తుల రద్దీ ని దృష్టిలో పెట్టుకొని వారికి ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రముఖుల పర్యటనల వలన దర్శన కోసం వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా తగినట్లు దర్శన సౌకర్యం కల్పించాలని తెలిపారు. గంగమ్మ జాతర మహోత్సవంలో భాగంగా మే 14 మంగళవారం చాటింపు, 15 వ తేదీ బుధవారం బైరాగి వేషం, 16 వ తేది గురువారం బండ వేషం, 17 వ తేది శుక్రవారం తోటి వేషం, 18 వ తేది శనివారం దొర వేశం, 19 వ తేదీ ఆదివారం మాతంగి వేషం, 20 వ తేది సోమవారం సున్నపు కుండలు, 21 వ తేది మంగళవారం గంగమ్మ జాతర సప్పరం, మే22 వ తేది బుధవారం విశ్వరూప దర్శనం ఉంటుందని జాతర నాడు సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగినట్లు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, దేవదాయ శాఖ మల్టీజోన్-2 రీజనల్ జాయింట్ కమిషనర్ ఎండోమెంట్స్ ఎన్ వి ఎస్ఎన్ మూర్తి, తాతయ్యగుంట గంగమ్మ తల్లి ఈఓ మమత తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంత పోలింగ్‌కు పక్కా ఏర్పాట్లు

## : ఎన్నికల అధికారి అదితి సింగ్



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికలలో అన్ని సౌకర్యాలతో ప్రశాంత పోలింగ్ కు పక్కా ఏర్పాట్లు చేశామని తిరుపతి నియోజకవర్గం ఎన్నికల అధికారి, కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. అర్బన్ తహశీల్దార్ కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్నికల అధి కారి అదితి సింగ్ మీడియాతో మాట్లాడారు. మే 13న జరిగే పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పా ట్లు, జాగ్రత్తలు తీసుకుంట్టున్నామని, నియోజకవర్గంలో మంగళవారం వరకు ఎన్నికల డ్యూటి ఓటర్లు 3545 మంది, ఎమర్జెన్సీ సర్వీసుల ఓటర్లు 99 మంది పోస్టల్ బ్యాలెట్ ను, 84 మంది ఇంటి వద్దనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం కూడా మరికొంత మంది పోస్టల్ బ్యాలెట్‌ను వేశారని ఆర్వో తెలిపారు. మే 13వ తేది ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో 3,02,503 మంది ఓటర్లుగా వున్నారని, ఇందులో 1,52,622 మంది స్త్రీలు, 1,49,846 మంది పురుషులు, ఇతరులు 35 మంది ఓటర్లుగా వున్నారని తెలిపారు. తిరుపతి అసెంబ్లీ పరిధిలో మొత్తం 274 పోలింగ్ బూతులు వున్నాయని, 323 మంది ప్రిసైడింగ్ ఆఫిసర్లు, 314 మంది ఏపిఓలుగా, 1231 మంది ఓపిఓలుగా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తారని, అలాగే 128 మంది మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. 274 పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసామని, పోలింగ్ కేంద్రంలోను, బయట కూడా విడియోలు చిత్రీకరణకు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో షామియానాలు, తాగునీరు, లైటింగ్, ర్యాంపులు, వీలు చైర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా సిబ్బంది విధుల్లో వుంటారని, అవాంచనీయ సంఘటనలు ఎక్కడైన జరిగితే చట్టప్రకారం క్రిమినలు కేసులు నమోదు చేస్తామని, ఓటర్లు తమ గుర్తింపు కార్డులతో వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని తెలిపారు.

# జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబుకు ఘన స్వాగతం

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు హాజరయ్యేందుకు బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పశుబిలిటీ హరిప్రసాద్ పుష్పగుచ్ఛన్ని అందించి శాలువుతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్లో నాగేంద్రబాబు తో కలిసి రాజంపేట పార్లమెంటు పరిధిలో జరిగే ప్రజా కలం సభకు బయలుదేరి వెళ్లారు. అలాగే ఆయనకు జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎన్నికల జనసేన పార్టీ పరిశీలకులు కాయగూర లక్ష్మీపతి, అనంతపురం అర్బన్ నగర్ ఉపాధ్యక్షులు గ్రంధే దివాకర్, తిరుపతి నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ కిరణ్ రాయల్ పుష్పగుచ్చాన్ని అందించి సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం నాగేంద్రబాబు రాజంపేటలో నిర్వహించునున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు బయలుదేరి వెళ్లారు. జనసేన నాయకులు బండమీదపల్లి గోపాల్, చిత్తూరు జిల్లా కాపునాడు అధ్యక్షులు సరిత నాగరాజు నాగేంద్రబాబు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.





నాగేంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జనసేన నేతలు

జనం కోసమే
సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116